# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ:  25-09-2026                                        సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- వసుధైవ కుటుంబకం స్ఫూర్తి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజల సమిష్టి, శ్రేయస్సును ప్రతిబింబిస్తుందని ఉపరాష్ట్రపతి సీ.పీ. రాధాకృష్ణన్ అన్నారు.
- వికసిత్ భారత్ లక్ష్యం అందరి భాగస్వామ్యం, సహకారంతో అవుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.
- నేటి ప్రపంచ వాస్తవాలను మరింత మెరుగ్గా ప్రతిబింబించేలా ఐక్యరాజ్య సమితి మారాలని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అభిప్రాయం వ్యక్తం చేశారు.
- సామాన్య ప్రజల జీవిత సమస్యలకు ఆవిష్కరణల ద్వారా పరిష్కారాలను రూపొందించాలని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి యువ ఆవిష్కర్తలకు పిలుపునిచ్చారు.

==========================

వసుధైవ కుటుంబకం స్ఫూర్తి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజల సమిష్టి శ్రేయస్సును ప్రతిబింబిస్తుందని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. న్యూఢిల్లీలోని ఉపరాష్ట్రపతి భవన్‌లో ఈరోజు జరిగిన అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్య కార్యక్రమం ఇన్-స్టెప్ నాల్గవ సంచికలో పాల్గొన్న వారితో ఆయన మాట్లాడుతూ.. పరస్పర సంబంధాలు పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో ప్రపంచ దేశాలు తమకు ఎదురయ్యే సవాళ్లను ఒంటరిగా పరిష్కరించలేవని పేర్కొన్నారు. భారతదేశం జీ-20కి అధ్యక్షత వహించిన సమయంలో వసుధైవ కుటుంబకం స్ఫూర్తి.. సమ్మిళిత, సహకార అంతర్జాతీయ భాగస్వామ్యాల పట్ల భారతదేశ విధానానికి మార్గదర్శకంగా నిలిచిందన్నారు. అనంతరం నేషనల్ డిఫెన్స్ కాలేజ్ కమాండెంట్ ఎయిర్ మార్షల్ మనీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ... 'నేషనల్ డిఫెన్స్ కాలేజ్' వ్యూహాత్మక విద్యకు అత్యున్నత కేంద్రమని అన్నారు. సాయుధ దళాలలోను, సివిల్ సర్వీసెస్ ఉన్నతాధికారులలోను, మిత్ర దేశాలలో వ్యూహాత్మక ఆలోచన, నాయకత్వాన్ని తీర్చిదిద్దడంలో ఒక ప్రత్యేక పాత్ర పోషిస్తుందని వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వికసిత్ భారత్ లక్ష్యం అందరి భాగస్వామ్యం, సహకారం అవుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. `సేవా సంకల్ప అభియాన్`లో భాగంగా వారణాసి నుండి వడ్‌నగర్‌కు జరుగుతున్న యాత్రలో పాల్గొంటున్న సేవా యాత్రికులతో ఆయన వర్చువల్ విధానంలో ఈరోజు సంభాషించారు. యువత, సేవా కార్యక్రమాల ద్వారా ఈ యాత్రను మరింత అర్థవంతం చేస్తుండటం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. గడచిన 12 ఏళ్లలో దేశంలోని గ్రామాలు, నగరాల మధ్య వ్యత్యాసం గణనీయంగా తగ్గిందని, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడటంతో పాటు.. దేశంలోని మహిళల్లో స్వయం సమృద్ధి కూడా పెరిగిందని పేర్కొన్నారు. ఈరోజు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి అని గుర్తుచేసిన ప్రధానమంత్రి.. ఆయన బోధించిన సేవ, సమతుల్యత, సహనం, సమన్వయం, సానుకూల దృక్పథం, సున్నితత్వం, సంభాషణ అనే 7 సూత్రాలను ప్రస్తావిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సామాన్య ప్రజల జీవిత సమస్యలకు ఆవిష్కరణల ద్వారా పరిష్కారాలను రూపొందించాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి యువ ఆవిష్కర్తలకు పిలుపునిచ్చారు. బెంగళూరులోని ఐఐఎస్‌సిలో ఈరోజు జరిగిన `సేవా ఫస్ట్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ – సౌత్ జోన్` ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజల దైనందిన జీవితాలను మెరుగుపరిచే మెళుకువలను అభివృద్ధి చేయడంలో ఈ కార్యక్రమం అందరిని ఒకచోట చేర్చుతుందన్నారు. 2047 వికసిత్ భారత్ లక్ష్య సాధనకు దోహదపడేలా యువ ఆవిష్కర్తల ఆలోచనలను పరిష్కారాలుగా మార్చేందుకు సహాయం అందించాలని అంకుర సంస్థలు, పారిశ్రామిక భాగస్వాములను కోరారు. పునరుత్పాదక ఇంధనం, గ్రీన్ హైడ్రోజన్, వర్ధమాన సాంకేతికతల్లో ఆవిష్కరణలు ఎంతో ఆవశ్యకమని ప్రహ్లాద్ జోషి ఉద్ఘాటిస్తూ..

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆయుష్మాన్ భారత్ పథకం.. దేశ ఆరోగ్య సంరక్షణ రంగ స్వరూపాన్ని మార్చివేసిందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జె. పి. నడ్డా అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఆరోగ్య మంథన్ 2026 ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ఈ పథకం కింద ఇప్పటివరకు సుమారు 13 కోట్ల మంది రోగులకు చికిత్స అందించారని తెలిపారు. జాతీయ ఆరోగ్య సంస్థ ద్వారా దాదాపు 2 లక్షల కోట్ల రూపాయలు పంపిణీ చేయబడ్డాయని చెప్పారు. ఆయుష్మాన్ భారత్ ఇప్పుడు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అమలులో ఉందని, దీనివల్ల పెద్ద సంఖ్యలో వలస కార్మికులు లబ్ధి పొందుతున్నారని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఐక్యరాజ్యసమితి సంస్కరణల విషయంలో పురోగతి లేకపోవడంపై అంతర్జాతీయ సమాజంలో అసంతృప్తి పెరుగుతోందని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. న్యూయార్క్‌లో జరుగుతున్న 81వ ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం సందర్భంగా Ruptures & Ramparts: Building Bridges for a Changing World' శీర్షికతో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నేటి ప్రపంచ వాస్తవాలను మరింత మెరుగ్గా ప్రతిబింబించేలా ఐక్యరాజ్యసమితి మారాలన్న భావన ప్రజల్లో పెరుగుతోందన్నారు. ఐక్యరాజ్య సమితిని బలోపేతం చేసే ప్రయత్నాలకు మద్దతు ఇవ్వని దేశాలు ఆ సంస్థను ఉపయోగించుకోలేవని చెప్పారు. కాగా.. ఈ సర్వ సభ్య సమావేశం సందర్భంగా భారత్ లైబీరియా దేశాలు సంయుక్తంగా గ్రూప్ ఆఫ్ ఫ్రెండ్స్ సేఫ్టీ ఎండ్ సెక్యూరిటీ ఆఫ్ షిప్పింగ్ ఎండ్ సీ ఫేరర్స్ ను ప్రారంభించాయి. గల్ఫ్, ఎర్ర సముద్రం, నల్ల సముద్రం, ఒమన్ గల్ఫ్ వంటి ప్రాంతాల్లో వాణిజ్య నౌకలు, నావికులపై జరుగుతున్న దాడులను పరిష్కరించడం ప్రధాన లక్ష్యంగా ఈ గ్రూప్ ఏర్పాటైందని జైశంకర్ పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకెన్లు)

==========================

గత దశాబ్ద కాలంలో భారతదేశం ఆవిష్కరణలు, పరిశోధనలలో గణనీయమైన వృద్ధిని సాధించిందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. న్యూఢిల్లీలో కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (CSIR) 85వ వ్యవస్థాపక దినోత్సవంలో ఆయన ఈరోజు పాల్గొని మాట్లాడుతూ... గత 5, 6 దశాబ్దాలతో పోలిస్తే గడచిన పదేళ్లలోనే దేశంలో అధిక ఆవిష్కరణలు, పరిశోధన కార్యకలాపాలు, కొత్త ప్రయోగశాలల స్థాపన జరిగాయన్నారు.

==========================

అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ తన స్థానాన్ని నిలబెట్టుకుంటోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. గ్రేటర్ నోయిడాలో ఆయన ఈరోజు  ఉత్తరప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన (యూపీఐటీఎస్)ను ప్రారంభించిన సందర్భంగా మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ 7.8 శాతం వృద్ధి రేటును సాధించిందన్నారు. ఎగుమతులు అనేక రెట్లు పెరిగాయని, సెమీకండక్టర్ రంగంలో వేగవంతమైన పురోగతి ఉందని అమిత్ షా పేర్కొంటూ.. 2047 నాటికి `వికసిత్ భారత్` అనే సంకల్పంతో దేశం ముందుకు సాగుతోందని తెలియజేశారు.

==========================

ఆసియా గేమ్స్- 2026లో భారత మహిళా అథ్లెట్ భరణికా ఇళంగోవన్ పోల్ వాల్ట్ (pole vault) ఈవెంట్‌లో 4.15 మీటర్ల ఎత్తు ఎగిరి కాంస్య పతకం సాధించింది. ఇప్పటివరకు నిర్వహించిన ఆసియా గేమ్స్‌లో ఈ ఈవెంట్‌లో భారత్‌కు పతకం రావడం ఇదే ప్రథమం. మరోవైపు, లాంగ్ డిస్టెన్స్ రన్నింగ్ విభాగంలో గుల్‌వీర్ సింగ్ రజతం సాధించాడు. పురుషుల 10 వేల మీటర్ల దూరాన్ని 28 నిమిషాల 29 సెకన్ల 38 మిల్లీ సెకన్లలో పూర్తి చేసి సిల్వర్ మెడల్ అందుకున్నాడు. తాజా ఆసియా క్రీడల్లో భారత్ ఇప్పటివరకు 2 స్వర్ణం, 9 రజతం, 12 కాంస్య పతకాలతో కలిపి మొత్తం 23 పతకాలు సాధించింది.

==========================

సమర్థవంతమైన అటవీ నిర్వహణ కోసం సామర్థ్య పెంపుదల ప్రాజెక్ట్ వర్క్‌షాప్‌ను కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ న్యూఢిల్లీలో ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ ప్రాజెక్టు.. అటవీ అగ్నిప్రమాదాల నిర్వహణ, జీవవైవిధ్య పరిరక్షణ, వాతావరణ చర్యలలో సాంకేతిక, క్షేత్రస్థాయి సామర్థ్యాలను పెంపొందించగలదని అన్నారు.

==========================
==========================